
సాక్షి
పల్నాడు
శుక్రవారం । 19 । జనవరి । 2024



క్యాలెండర్ ఆవిష్కరణ

నెహ్రూనగర్: అఖల భారత గిరిజన ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ మొగిలి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా సంఘ నాయకులు గురువారం ఆవిష్కరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 520.60 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 826.50 అడుగుల వద్ద ఉంది.

న్యూరాలజీ విభాగాధిపతిగా డాక్టర్ అరుణకుమారి



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగాధిపతిగా డాక్టర్ యు.అరుణకుమారిని నియమిస్తూ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

న్యూస్‌రీల్

నేడు, రేపు ఏపీఎస్‌పీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు

ఏఎన్‌యూ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్పెషల్ ప్రొటక్షన్ ఫోర్స్ (ఏపీఎస్‌పీఎఫ్) పోలీస్ స్పోర్ట్స్ మీట్ శుక్ర, శనివారాలలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌పీఎఫ్ ఐజీ వెంకటరామిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా వాలీబాల్, బ్యాడ్మింటన్ అంశాలల్లో పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో 150 మంది ఎస్‌పీఎఫ్ సిబ్బంది, అధికారులు పాల్గొంటున్నారని తెలిపారు.

యార్డులో 1,03,408 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,03,408 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 90,729 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.20,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 21,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.15,500 నుంచి రూ.19,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.11,000 నుంచి 11,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 51,101 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు.

నాట్కో సెంటర్‌కు అదనపు స్థలం మంజూరు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు 1254 చదరపు అడుగుల అదనపు స్థలం మంజూరు చేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జీజీహెచ్‌లో నాట్కో ట్రస్టు ఆధ్వర్యంలో రూ.40 కోట్లతో 2019లో క్యాన్సర్ సెంటర్‌ను నిర్మించారు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.50 కోట్ల ఖరీదు చేసే వైద్య పరికరాలను నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు అందజేసింది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అత్యాధునిక వైద్య సౌకర్యాలతో ఉచితంగా కార్పొరేట్ క్యాన్సర్ వైద్య సేవలు గుంటూరు జీజీహెచ్‌లో అందజేస్తున్నారు. క్యాన్సర్ సెంటర్‌కు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి రోగులు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం క్యాన్సర్ సెంటర్‌ను గ్రేడ్-1 లెవల్‌కు పెంచేందుకు రంగం సిద్ధం చేసింది. అందులో భాగంగా అదనంగా భవన నిర్మాణాలు, ముఖ్యంగా క్యాన్సర్ చివరి దశలో ఉన్నవారికి ప్యాలేటివ్ కేర్ చికిత్స అందించేందుకు ప్రత్యేకంగా భవన నిర్మాణం చేపట్టేందుకు నాట్కో కేర్ సెంటర్‌కు అదనంగా స్థలం మంజూరు చేస్తూ ఉత్తర్వులు మంజూరు చేశారు.

వ్యవసాయ కళాశాల అభివృద్ధికి రూ.80లక్షలు విరాళం

బాపట్ల: బాపట్ల వ్యవసాయ కళాశాలకు పూర్వ విద్యార్థులు సాయంగా నిలిచారు. 1980 బ్యాచ్‌కి చెందిన పూర్వవిద్యార్థులు కళాశాలకు రూ.80లక్షలు విరాళాన్ని ప్రకటించారు. ఈమేరకు ఫిబ్రవరి 11న భూమిపూజ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన హరిప్రసాద్ ఒక్కరే రూ.50లక్షలు ఆర్థిక సాయాన్ని అందించారు. తాను చదివిన కళాశాల అభివృద్ధికి అవకాశం దక్కటం ఎంతో సంతోషంగా ఉందని హరిప్రసాద్ తెలిపారు. కళాశాల చరిత్రలోనే ఇంత భారీ విరాళం ఇవ్వటం ఇదే మొదటిసారి కావటంతో అలుమ్ని అభినందనలు తెలిపింది. వీరితోపాటు అదే బ్యాచ్‌కి చెందిన నందూరి శ్రీనివాస్ కూడా కళాశాలలో ఒక గది నిర్మాణానికి విరాళాన్ని ప్రకటించారు.

దుర్గమ్మకు కానుకగా వెండి బిందె



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు గుంటూరుకు చెందిన జి.నారాయణ తీర్థ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ శాంతి చేతుల మీదగా ఆలయ ఈఈ కోటేశ్వరరావుకు వెండి బిందెను సమర్పించింది. సుమారు 585 గ్రాముల వెండితో తయారు చేసిన బిందెను అమ్మవారి పూజా కార్యక్రమాలలో వినియోగించాల్సిందిగా దాతలు ఆలయ అధికారులను కోరారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు.

సామాజిక న్యాయ చిహ్నం | సమానత్వ స్వరూపం

అది విగ్రహం కాదు విప్లవం.. అది చూపుడు వేలు కాదు అణగారిన వర్గాల గుండె దివ్వెలను వెలిగించిన కిరణం.. ఒక జీవన వ్యవస్థ నిర్మాతగా తాను జీవించిన కాలంలోనే గాక భవిష్యత్ తరాలకు అక్షర సముచ్ఛయాన్ని నిర్మించి మార్గదర్శనం చేసిన మేధావి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్. అంబేడ్కరుడంటేనే ఆకాశమంత స్ఫూర్తి.. ఆయన చూపిన మార్గం దేశానికి దీప్తి.. ఆ ఆదర్శ మూర్తి నిలువెత్తు స్వరూపం బెజవాడ నడిబొడ్డున కొలువుదీరింది. రాష్ట్రంలోని ప్రస్తుత ప్రభుత్వంలో అమలవుతున్న సామాజిక న్యాయానికి ప్రతీకగా స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ పేరుతో ఆవిష్కరణకు సిద్ధమైంది. దీనిని శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో పూర్తయిన సభ ఏర్పాట్లు



అంబేడ్కర్ స్మృతి వనంలోని మ్యూజియం లోపలి చిత్రాలు

చారిత్రక ఘట్టం.. మనందరి గర్వకారణం

- సామాజిక న్యాయ మహాశిల్పం ప్రారంభోత్సవం నేడే
- ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లింపులను వివరించిన కలెక్టర్, సీపీ



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ టి.కె. రాణా

సాక్షి ప్రతినిధి, విజయవాడ: దేశ ప్రజలు అనుభవిస్తున్న రాజ్యాంగ హక్కులకు ఆద్యుడు, దేశ రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జ్ఞాపకాన్ని విగ్రహం రూపంలో దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్టీఆర్ జిల్లాలో ప్రతిష్ఠించడం మనందరికీ గర్వకారణమని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ టి.కె.రాణాతో కలిసి ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం జరిగే భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వస్తున్న 1.50 లక్షల మంది ప్రజలకు ఆతిథ్యం ఇవ్వడం మన బాధ్యతని కలెక్టర్ అన్నారు. ఈ క్రమంలో ఎదురయ్యే చిన్న ఇబ్బందులను నగర ప్రజలు గుర్తించి సహకరించాలని కోరారు. శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి రాత్రి పది గంటల వరకు విగ్రహ ప్రతిష్ఠ పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకల్లో కొన్ని మార్పులు చేసినట్లు వెల్లడించారు.

నగరంలో ట్రాఫిక్ మార్పులు..

శుక్రవారం ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు విజయవాడ నగరంలో వాహనాలను మళ్లిస్తామని సీపీ టి.కె. రాణా తెలిపారు.

- విశాఖపట్నం నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు రామవరప్పాడు రింగు-మహానాడు జంక్షన్-నోవోటెల్ హోటల్ వద్ద బెంజిసర్కిల్ పాత ఫ్లై ఓవర్ మీదుగా-స్క్యూ బ్రిడ్జి-వారధి జంక్షను నుంచి పీఎన్‌బీఎస్‌కు వెళ్లాలి.
- మచిలీపట్నం నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు తాడిగడప నుంచి 100 అడుగుల రోడ్డు మీదుగా ఎనికేపాడు-ప్రసాదంపాడు-రామవరప్పాడు రింగు-మహానాడు జంక్షను-నోవోటెల్ హోటల్ వద్ద బెంజ్ సర్కిల్ పాత ఫ్లై ఓవర్ మీదుగా-స్క్యూబ్రిడ్జి-వారధి జంక్షను నుంచి బస్టాండ్‌కు వెళ్లాలన్నారు.
- బస్టాండ్ నుంచి విశాఖపట్నం వెళ్లే ఆర్టీసీ బస్సులు పీసీఆర్ జంక్షను-ప్రకాశం విగ్రహం జంక్షన్-పాత గవర్నమెంట్ ఆస్పత్రి రోడ్డు, ఏలూరు లాకులు, జి.ఎస్.రాజు రోడ్డులో సీతన్నపేట సిగ్నల్ జంక్షను నుంచి బీఆర్టీఎస్ రోడ్డులో శారద కాలేజీ జంక్షన్, ఫుడ్ జంక్షను, పడవల రేవు జంక్షను, గుణదల, రామవరప్పాడు రింగ్ మీదుగా వెళ్లాలని తెలిపారు.
- బస్టాండ్ నుంచి మచిలీపట్నం, గుడివాడ వెళ్లే ఆర్టీసీ బస్సులు పీసీఆర్ జంక్షన్-ఆర్టీసీ వై జంక్షన్-చల్లపల్లి బంగ్లా-హనుమాన్ పేట-ఏలూరు లాకులు-సీతన్నపేట గేటు, బీఆర్టీఎస్ రోడ్డు-పడవల రేవు-గుణదల-రామవరప్పాడు రింగ్-ఎనికేపాడు జంక్షన్-తాడిగడప 100 అడుగులు రోడ్డు మీదుగా వెళ్లాలని వివరించారు.
- బెంజ్‌సర్కిల్ నుంచి బందరు రోడ్డు మీదుగా పీసీఆర్ వైపు వెళ్లే సిటీ బస్సులు బెంజి సర్కిల్-పకీరుగూడెం జంక్షన్-స్క్యూ బ్రిడ్జి-వారధి జంక్షన్ మీదుగా బస్టాండ్‌కు చేరుకోవాలి.
- బస్టాండ్ సిటీ బస్ టెర్మినల్ నుంచి ఇబ్రహీంపట్నం వెళ్లే సిటీ బస్సులు పీఎన్‌బీఎస్ మధ్య గేటు నుంచి రాజీవ్ గాంధీపార్కు-కనకదుర్గ ఫ్లై ఓవర్-స్వాతి జంక్షన్ మీదుగా వెళ్లాలి.

భారీ వాహనాలకు ప్రవేశం లేదు

ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ టి.కె.రాణా మాట్లాడుతూ.. విజయవాడలోనికి శుక్రవారం ఉదయం పది గంటల నుంచి భారీ వాహనాలకు ప్రవేశం లేదన్నారు. ఇందుకనుగుణంగా చేపట్టిన మార్పులను వివరించారు. రాష్ట్ర మొత్తం నుంచి ఆర్టీసీ బస్సులు 2,500తో పాటు ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన బస్సులకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశామన్నారు.

అందరివాడు అంబేడ్కర్

- విజయవాడలో 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై సర్వత్రా హర్షం
- నేడు 'సామాజిక న్యాయ మహాశిల్పం' ఆవిష్కరణ
- పల్నాడు జిల్లా నుంచి భారీగా జన సమీకరణకు ఏర్పాట్లు



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు, నాయకులు(ఫైల్)

సత్తెనపల్లి: రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేయనున్న 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం దేశానికే తలమానికమంటూ అంబేడ్కర్ వాదులు, దళిత నాయకులు, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. ఈనెల 19న విజయవాడ స్వరాజ్య మైదానంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. దాదాపు రూ.400 కోట్ల వ్యయంతో 20 ఎకరాల విశాల ప్రాంగణంలో అంబేడ్కర్ స్మృతి వన నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈక్వాలిటీ ఆఫ్ లిబర్టీగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా దీనిని ఏర్పాటు చేసింది. అంబేడ్కర్ భావజాలంతో పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరివాడైన అంబేడ్కర్ స్మృతివనాన్ని అన్ని సదుపాయాలతో ఏర్పాటు చేయడంపై వివిధ వర్గాల నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంబేడ్కర్ స్మృతి వనంలో అంబేడ్కర్ జీవిత చరిత్ర తెలిపే మ్యూజియం, మినీ థియేటర్, కన్వెన్షన్ సెంటర్, స్కై లైటింగ్, ఫౌంటెన్లు, లైబ్రరీ వంటి వాటితో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంపై సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

పల్నాడు నుంచి భారీగా జన సమీకరణ....

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈనెల 19న విజయవాడలో అంబేడ్కర్ న్యాయ శిల్పం ఆవిష్కరణ కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో దీనిని విజయవంతం చేయాలని జిల్లాలోని మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నంబూరి శంకరరావు, బొల్ల బ్రహ్మనాయుడు, కాసు మహేష్ రెడ్డిలు పిలుపునిచ్చారు. ఇప్పటికే జనసమీకరణ పై ఆయా నియోజకవర్గాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి కార్యక్రమం సన్నాహాలపై చర్చించారు.

విగ్రహావిష్కరణకు 231 బస్సులు..

నరసరావుపేట: విజయవాడ స్వరాజ్య మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన సామాజిక న్యాయ మహాశిల్పం (భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్) 206 అడుగుల భారీ విగ్రహ ఆవిష్కరణకు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి ప్రజలు తరలివెళ్లేందుకు 231 ఆర్టీసీ బస్సులను ఏర్పాటుచేసినట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ పీడీ ఓబులునాయుడు గురువారం పేర్కొన్నారు. ఈ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తారన్నారు. దీనికి గాను ప్రజలు తరలివెళ్లేందుకు ప్రతి నియోజకవర్గానికి 33 బస్సులను ఏర్పాటుచేయటం జరిగిందన్నారు. ప్రజలు భారీ ఎత్తున తరలివెళ్లి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ పోస్టర్లను ఆవిష్కరించారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్ సామాజిక సాధికారతకు కృషి చేస్తున్నారని, ఈ క్రమంలో పెద్దఎత్తున అభిమానులు తరలి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, పెదకూరపాడు, చిలకలూరిపేట, సత్తెనపల్లి, గురజాల, వినుకొండ, మాచర్ల నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున అంబేడ్కర్ వాదులు, దళిత నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయా వర్గాలు, తరలిరానున్నాయి. ఈ మేరకు అవసరమైన వాహనాలు, తదితర ఏర్పాట్లను ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు చూస్తున్నారు. దీనిపై పలువురు నాయకులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.

206 అడుగుల అంబేడ్కర్ విగ్రహం చరిత్రాత్మకం



విజయవాడ నడిబొడ్డున సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చారిత్రాత్మక విషయం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటలతో కాకుండా చేతలతో చేసి చూపించారు. వాస్తవానికి 2013లోనే ఉమ్మడి రాష్ట్రంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని ఎంతో మంది కోరారు. కానీ అప్పుడు చేయలేకపోయారు. సంక్షేమపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు. స్వచ్ఛందంగా తరలివచ్చి భాగస్వాములు కావాలి.

–కోడిరెక్క దేవదాస్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు, సత్తెనపల్లి

అంబేడ్కర్ నిజమైన వారసుడు సీఎం జగన్..



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతర పేదలకు సంక్షేమ ఫలాలు అందించటమే ధ్యేయంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిజమైన అంబేడ్కర్ వారసుడు. అంబేడ్కర్ ఆశయాలను తు.చ. తప్పకుండా అమలు చేస్తున్న వ్యక్తి సీఎం జగన్. అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహావిష్కరణకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి రావాలి.

– చిలుక జైపాల్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు

అంబేడ్కర్ ఆశయాలు నెరవేరుస్తున్న సీఎం జగన్



రాష్ట్రంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా నిమ్న జాతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందరి ఆశయాలు నెరవేర్చే దిశగా పాలన సాగిస్తున్నారు. పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందాలనే బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆలోచన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నెరవేరుతుంది. 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించనుండడం నిజంగా అభినందించదగ్గ విషయం. ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలి.

– పెండెం బాబురావు, ఏఎంసీ చైర్మన్, సత్తెనపల్లి

అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి



బడుగు, బలహీన వర్గాల వారు అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి. విజయవాడలో 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించనుండడం అభినందనీయం. ఈనెల 19న జరిగే ఈ గొప్ప కార్యక్రమంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, కార్మికులు, మహిళలు, ప్రతి ఒక్కరు తరలివచ్చి భాగస్వాములు కావాలి.

–దావులూరి కోటేశ్వరరావు, అంబేడ్కర్ ప్రజా సంఘం జిల్లా అధ్యక్షుడు, సత్తెనపల్లి

ప్రభుత్వ అనుగృహంతో హాయిగా ఉన్నాం



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

- ఆనందం వ్యక్తం చేసిన జగనన్న ఇళ్ల లబ్ధిదారులు
- జిల్లాలో 10,160 గృహాలు పూర్తి
- 13,364 మంది లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ రూ.1.60కోట్లు
- చెక్కు అందజేసిన జిల్లా కలెక్టర్ శివశంకర్, అధికారులు

నరసరావుపేట: జిల్లాలో మొత్తం 39,507 గృహాలకు 10,160 గృహాలకు సంబంధించిన అన్ని పనులు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. అందులో బ్యాంక్ రుణాలు తీసుకొన్నవారు 13,364 మంది ఉండగా వారికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం పూర్తి రీయింబర్స్‌మెంట్ కింద రూ.1,60,11,480 వడ్డీని వారి ఖాతాలలో జమ చేశారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ క్యాంప్ కార్యాలయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక గ్రూపులకు పావలా వడ్డీ రీయింబర్స్‌మెంట్ నగదు జమచేసే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ లబ్ధిదారులు, అధికారులతో కలిసి కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 219 గృహాల నిర్మాణం మొదలు కాలేదని, బేస్‌మెంట్ లెవల్ కింద 12,811 గృహాలు, బేస్‌మెంట్ లెవల్ వరకు 12,005, రూఫ్ లెవల్‌కు 1,818, శ్లాబ్ పూర్తి అయినవి 2,494 ఉన్నాయన్నారు. జిల్లా గృహనిర్మాణ శాఖాధికారి ఎస్.వేణుగోపాలరావుతో కలిసి లబ్ధిదారులకు మెగా చెక్కును అందచేశారు.

జగనన్న దయతో సొంతిల్లు



14ఏళ్లుగా సొంతిల్లులేక అద్దె ఇంట్లో అవస్థలు పడుతున్న మాకు ఉప్పలపాడు లేఅవుట్‌లో స్థలం మంజూరైంది. ఆ స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు రూ.1.80లక్షలు ఉచితంగా ఇవ్వగా, డ్వాక్రా రుణంగా రూ.35వేలు, బ్యాంకు నుంచి రూ.లక్ష రుణం తీసుకొని ఇల్లు కట్టుకొని జీవిస్తున్నాం.

–వెంకటరమణ, నరసరావుపేట పట్టణం

ప్రభుత్వ స్థలంలో ఇల్లు కట్టుకున్నాం



సొంతిల్లులేక అద్దె ఇంట్లో ఉండే మాకు కేసానుపల్లి లేఅవుట్‌లో ఉచితంగా స్థలం మంజూరైంది. ప్రభుత్వ సహాయం, డ్వాక్రా, బ్యాంకుల నుంచి మంజూరైన రుణంతో సొంతిల్లు కట్టుకొని నివాసం ఉంటున్నాం. జగనన్న దయంతో సొంతింటి కల నెరవేరింది.

– లక్ష్మీఉమాదేవి, నరసరావుపేట పట్టణం

నేడు ట్రాఫిక్ మళ్లింపు

అత్యవసర వాహనాలకు అనుమతి

నగరంపాలెం: విజయవాడలో శుక్రవారం 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి గుంటూరు నగర పరిసరాలతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ట్రాఫిక్ మళ్లింపు మొదలవుతుందని ఆయన పేర్కొన్నారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు చేపడుతున్న ఈ మార్పులు గమనించి విజయవాడ వైపు వెళ్లే ప్రతి వాహనదారుడు సహకరించాలని కోరారు.

- గుంటూరు నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలు బుడంపాడు జంక్షన్ వద్ద హైవే దిగి తెనాలి, వేమూరు, కొల్లూరు, వెల్లటూరు జంక్షన్, పెనుమూడి బ్రిడ్జి, అవనిగడ్డ, పామూరు - గుడివాడ, హనుమాన్ జంక్షన్ (ఇరువైపుల) మీదగా వెళ్లాలి.
- గుంటూరు నుంచి విజయవాడ వైపు వెళ్లే భారీ వాహనాలను విజయవాడలోకి అనుమతించరని, బోయపాలెం సర్వీస్ రోడ్‌లో నిలుపుదల చేసుకోవాలి.
- గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు పేరేచర్ల జంక్షన్ నుంచి సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదుగా హైదరాబాద్ వెళ్లాలి. విజయవాడ వైపు అనుమతించరు.
- చిలకలూరిపేట నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు చిలకలూరిపేట వై.జంక్షన్ (గుంటూరు) నుంచి చుట్టుగుంట, పేరేచర్ల మీదుగా వెళ్లాలి.
- అత్యవసర వాహనాలు/ విగ్రహావిష్కరణకు వెళ్లే వాహనాలు ఏ దారి నుంచైనా విజయవాడ వెళ్లేందుకు అనుమతిస్తారు. ప్రతి వాహనదారుడు పోలీసులకు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జయప్రదం చేయాలి

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: విజయవాడలో శుక్రవారం జరగనున్న అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణలో పల్నాడు జిల్లా నుంచి భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. అంబేడ్కర్ విగ్రహాన్ని వందల కోట్లతో భారీ ఏర్పాటు చేసి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆవిష్కరించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న ఆయన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పండుగలా జరుపుకోవాలని పిన్నెల్లి కోరారు.

అదనపు జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా సత్యనారాయణ

గురజాల : స్థానిక అదనపు జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా కిలారి వీర వెంకట సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇంచార్జిగా జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి డి. షర్మిల బాధ్యతలు నిర్వహించారు. పలువురు న్యాయవాదులు సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

నేటి నుంచి కందుల కొనుగోలు: జేసీ

నరసరావుపేట: ఆర్‌బీకేలు, మార్కెట్ యార్డుల వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం శుక్రవారం నుంచి రైతుల వద్ద కందులు కొనుగోలు చేస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. క్వింటాలు రూ.9,310కు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్‌తో పాటు ఈకేవైసీ చేయించుకుని ఉండాలని సూచించారు. వారం రోజుల్లోనే డబ్బు నేరుగా వారి ఖాతాకు జమ అవుతుందని, రైతుకు రసీదు కూడా ఇస్తారన్నారు. ప్రతి రోజూ నాఫెడ్ రేటు ద్వారా ధర నిర్ణయిస్తారని, నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉన్న వాటినే కొనుగోలు చేస్తారని వెల్లడించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు కంట్రోలు రూం నంబర్ 88977 98430ను సంప్రదించాలని కోరారు.

యువతలో నైపుణ్యాల పెంపునకు క్రీడలు దోహదం

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- ముప్పాళ్లలో ముగిసిన 32వ రైతుమిత్ర జాతీయ కబడ్డీ పోటీలు



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఈపూరు: యువతలో నైపుణ్యాల పెంపునకు క్రీడలు దోహదపడతాయని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. మండలంలోని ముప్పాళ్లలో 32వ రైతుమిత్ర జాతీయస్థాయి కబడ్డీ పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. చివరి రోజు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. ఏటా కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. క్రీడల్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర వంటి కార్యక్రమాలు ఎన్నో చేపడుతున్నారని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి మొత్తం 25 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. కర్ణాటక వెంకట్ బీఎంటీసీ జట్టు విజేతగా నిలిచి రూ.2.50లక్షలు బహుమతి గెలుచుకుంది. హరియాణా యూనివర్సిటీ జట్టు ద్వితీయ బహుమతి, మనీష్‌రెడ్డి ఫ్రెండ్స్ సర్కిల్ జట్టు మూడో బహుమతి, హరియాణా జట్టు నాలుగో బహుమతి గెలుపొందింది. 11 స్థానాల వరకు బహుమతులకు ఎంపిక చేశారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలకు రూ.2.50లక్షల నగదు బహుమతి అందించిన మేఘన ఫుడ్స్ అధినేత బొల్లా రమేష్‌ను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

యువత సమాజ శ్రేయస్సును కోరుకోవాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ విజయవాడలో శుక్రవారం జరుగనున్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సామాజిక సమతా సంకల్పం అనే నినాదంతో స్థానిక గుంటూరులోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు రక్తదాన శిబిరాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత సమాజ శ్రేయస్సు కోరుతూ రక్త దానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. రక్తదాన శిబిరంలో జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డాక్టర్ పి.అనూష, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగస్తులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొన్ని సంవత్సరాలుగా క్రమం తప్పకుండా రక్తం అవసరమైన వారిని ఎన్నోసార్లు ఆదుకుంటూ, 97వ సారి రక్తదానం చేయడానికి ముందుకొచ్చిన గుంటూరుకు చెందిన ఉమామహేశ్వరరావు, మంగళగిరి ఇందిరానగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి పి.అనూష అంకితభావంతో వైద్య సేవలు అందజేస్తూ రక్త దానం చేయటానికి ముందుకొచ్చిన ఇద్దరిని శిబిరంలో అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు, జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ రాజు, జాతీయ హెల్త్ మిషన్ డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్న మన్మోహన్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కె.వి. సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న నక్కా వెంకటేశ్వర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతన సవరణకు సంబంధించిన 12వ పీఆర్సీ అమలు చేసే ముందుగా 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాల్లో గురువారం యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షురాలు బి. ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పీఎఫ్ బకాయిలను చెల్లించిన ప్రభుత్వం తక్షణమే ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైతే పాఠశాలల్లో ప్రతి రోజూ అదనంగా అరగంట పని చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. కళాధర్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25న ధర్నాలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎస్ కుసుమకుమారి, జిల్లా గౌరవాధ్యక్షుడు పీవీ శ్రీనివాస్, సహాధ్యక్షులు ఏఎల్ శివపార్వతి, కోశాధికారి ఎండీ గయాసుద్దొలా, జిల్లా కార్యదర్శి సీహెచ్ ఆదినారాయణ, కె.సాంబశివరావు, జి. వెంకటేశ్వరరావు, ఎం.గోవిందయ్య, టి. ఆంజనేయులు, యు.రాజశేఖర్, జీవీ ధనలక్ష్మి, కె. కేదార్నాథ్ పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుంది !

బాలిక కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల రూరల్: లైంగిక దాడికి గురైన బాలిక కుటుంబాన్ని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఏ సహాయం కావాలన్న తక్షణమే తనను కలవాలని సూచించారు. ప్రభుత్వం సహాయం త్వరగా అందే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వీరభద్రుని రామిరెడ్డి, సర్పంచ్ పీత వీరరాఘవయ్య, నాయకులు జొన్నల ఆదిరెడ్డి, శేఖర్‌బాబు, జాన్, సీతయ్య, కోంద్రు సైదులు, గొట్టిముక్కల పవన్‌రెడ్డి ఉన్నారు.

సంఘటన ప్రదేశాన్ని పరిశీలించిన దిశ డీఎస్పీ రవిచంద్ర

లైంగిక దాడికి గురైన బాలిక ఫిర్యాదు మేరకు ఆ గ్రామానికి దిశ డీఎస్పీ రవిచంద్ర వచ్చి పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులు, మధ్యాహ్న భోజనం వండేవారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్ని పరిశీలించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. చట్టపరంగా న్యాయం చేస్తామని తెలియజేశారు. ఆయన వెంట సీపీ పి.వి.ఆంజనేయులు ఉన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

పిడుగురాళ్ల: మండలంలోని బ్రాహ్మణపల్లి ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడు ఎస్‌కే షమీవుల్లాను విధుల నుంచి తొలగించినట్లు ఎంఈవో ఓ. రాజు గురువారం తెలిపారు.

పది సంవత్సరాల బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు అభియోగం రావడంతో జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నాటుసారా తయారీదారులపై కఠిన చర్యలు

- జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్
- వెదుళ్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులతో కార్డెన్ సెర్చ్
- స్వాధీనం చేసుకున్న వాటి వివరాలు వెల్లడి



పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటుసారా, బెల్లం ఊట

బాపట్ల టౌన్: నాటుసారా తయారుచేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. బాపట్ల సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులు, సెబ్ అధికారులు సంయుక్తంగా వెదుళ్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్ద గ్యాంగ్, చిన్న బేతపూడి, వృక్షనగర్ ప్రాంతాల్లో గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ నాటు సారా, ఇతర అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసే ఉద్దేశంతో కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. దాడుల్లో భాగంగా 2,500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. 25 లీటర్ల నాటు సారా, 3 కేజీల కరక్కాయలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీటితో పాటు ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారన్నారు. జిల్లాలో ఎవరైనా నాటు సారా తయారీ, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. పరివర్తన 2.0లో భాగంగా నాటుసారా సంబంధిత కేసుల్లోని ముద్దాయిలను బయటికు తీసుకువచ్చి ప్రత్యామ్నాయ ఉపాధిని కల్పించామన్నారు. అయినప్పటికీ కొంతమంది వ్యక్తులు వారి స్వలాభం కోసం ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే నాటుసారా తయారీ, క్రయవిక్రయాలకు పాల్పడుతున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అటువంటి వారిపై పీడీ యాక్ట్ అమలు పరుస్తున్నామని, అవసరమైతే జిల్లా బహిష్కరణకు కూడా వెనుకాడబోమని పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయడానికి జిల్లాలోని అనుమానిత ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తామన్నారు. ఏదైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్ఐ, డయల్ 100, 112 నంబర్లకు గానీ ఎస్పీ హెల్ప్‌లైన్ నెంబర్ 8333813228కు గానీ కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.

అంబేడ్కర్ జీవితం యువతకు ఆదర్శం

- ఆర్డీవో రవీంద్ర
- సామాజిక సమతా సంకల్పం విజయవంతానికి పిలుపు



బాపట్ల: సామాజిక సమతా సంకల్పం వేడుకలను విజయవంతం చేయాలని ఆర్డీవో రవీంద్ర పేర్కొన్నారు. బాపట్లలోని మున్సిపల్ హైస్కూలు నుంచి ఉద్యోగుల ఆధ్వర్యంలో గురువారం ప్రదర్శన చేపట్టారు. మున్సిపల్ హైస్కూలు నుంచి అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని మానవ హారం నిర్వహించారు. అంబేడ్కర్ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని రవీంద్ర కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏ.భానుప్రతాప్, డీఎంహెచ్‌వో రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో అత్యాధునిక మైక్రోబయాలజీ ప్రారంభం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎయిమ్స్ డైరెక్టర్ ముఖేష్ త్రిపాఠి

మంగళగిరి: నగర పరిధిలోని ఆల్ ఇండియా మెడికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(ఎయిమ్స్)లో అత్యాధునిక ల్యాబ్‌లు ప్రారంభించడం సంతోషంగా ఉందని, తద్వారా రోగులకు మరింత మెరుగైన వైద్య పరీక్షలు అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని డైరెక్టర్ ముఖేష్ త్రిపాఠి తెలిపారు. గురువారం ఎయిమ్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన క్లినికల్ మైక్రోబయాలజీ విభాగంలో ఇంటిగ్రేటెడ్ స్టువర్ట్‌షిప్ ల్యాబ్‌లో అత్యాధునిక వైద్య పరీక్షా పరికరాలను ఆయన ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక పరికరాలతో రోగులలో బ్యాక్టీరియా, ఫంగస్, క్రిమికీటకాలను అతి తక్కువ సమయంలో కనుగొనవచ్చని తెలిపారు. దీని వలన క్లినికల్ బయాలజిస్టులు రోగులకు సరిపడా యాంటీబయాటిక్స్ గురించి తెలియజేయవచ్చన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అత్యాధునిక పరీక్షా పరికరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ డాక్టర్ సుమిత్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల సంరక్షణ అందరి బాధ్యత

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి

పట్నంబజారు: బాలల హక్కులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి చెప్పారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం వీధి బాలలను కాపాడటం, పునరావాసం కల్పించడం అనే అంశంపై పోలీసులు, విద్యాశాఖ, సమగ్ర శిక్షణ, కార్మికశాఖ, సోషల్ వెల్ఫేర్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లీలావతి మాట్లాడుతూ ప్రభుత్వ శాఖ అధికారులు వీధి బాలల హక్కులు కాపాడేందుకు కృషి చేయాలన్నారు. రిపబ్లిక్‌డే సందర్భంగా జనవరి 12 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న వీధి బాలల సంరక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వీధి బాలలు, అనాథలు, యాచకులుగా ఉన్న చిన్నారులను గుర్తించి, వారికి తగిన పునరావాసం కల్పించేందుకు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

సర్వేయర్‌పై సర్పంచ్ దాడి

కేసు నమోదు చేసిన పోలీసులు



మేదరమెట్ల: తనపై బొడ్డువానిపాలెం గ్రామ సర్పంచ్ నేరెళ్ల సుబ్బయ్య దాడి చేశారని కొరిశపాడు మండల సర్వేయర్ మహేష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు.. బొడ్డువానిపాలెం రామాలయం సమీపంలో స్థలానికి సంబంధించి గత కొన్ని సంవత్సరాలుగా వివాదం నడుస్తోంది. దీనిపై ఒక పక్షానికి చెందిన వారు స్పందనలో అర్జీ ఇవ్వగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల సర్వేయర్ మరో పక్షానికి చెందిన గ్రామ సర్పంచ్‌కు నోటీసులు ఇవ్వడానికి వెళితే ఆయన స్వీకరించలేదు. గురువారం ఉదయం సర్వేయర్ మహేష్ ఆఫీసుకు వెళ్లే సమయంలో సర్పంచ్, అతని సోదరుడు కలిసి కొరిశపాడులోని ఇండియన్ గ్యాస్ కంపెనీ సమీపంలో దాడి చేశారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

సూర్యలంక తీరంలో మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రాణాలు కాపాడిన అవుట్‌పోస్ట్ పోలీసులు

బాపట్ల టౌన్: సూర్యలంక సముద్రతీరంలో మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. బాపట్ల పట్టణంలోని ఉప్పరపాలెం గ్రామానికి చెందిన 42 సంవత్సరాల వయస్సు గల మహిళ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ, వాటిని తట్టుకోలేక చనిపోవాలనే నిర్ణయానికి వచ్చింది. ఈ క్రమంలో గురువారం ఉదయం సూర్యలంక సముద్ర తీరం వద్ద ఆత్మహత్యకు యత్నించింది. అక్కడ గస్తీ నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ పోతురాజు తక్షణమే స్పందించి కాపాడారు. మహిళను కాపాడిన అవుట్‌పోస్ట్ సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ట్రామా కేర్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్, స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగ నియామకాలకు దరఖాస్తు చేసుకున్న వారి ప్రొవిజనల్ మెరిట్ లిస్టును గురువారం విడుదల చేసినట్లు సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తెలిపారు. లిస్టును గుంటూరు.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. లిస్టులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు లిఖిత పూర్వకంగాధృవపత్రాలతో జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

టీబీ ఉద్యోగాల ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: జిల్లా టీబీ కార్యాలయంలో నేషనల్ టీబీ కంట్రోల్‌లో భాగంగా కాంట్రాక్టు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నవారి ప్రొవిజనల్ మెరిట్ లిస్టును గురువారం విడుదల చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. లిస్టును గుంటూరు ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు గుంటూరు జీజీహెచ్ ఆవరణంలోని జిల్లా క్షయ నివారణ కేంద్రంలో ధృవపత్రాలతో లిఖిత పూర్వకంగా అందజేయాలని సూచించారు. ఉద్యోగాలకు అర్హులైన వారిని ప్రతిభ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం భర్తీ చేస్తున్నామని వెల్లడించారు.

విదేశీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

బాపట్ల అర్బన్: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ప్లాస్టరింగ్ వర్క్, సిరామిక్ వర్క్, బిల్డింగ్ ఫ్రేమ్ వర్క్, ఐరన్ బెండింగ్ వంటి రంగాల్లో ఇజ్రాయిల్ దేశంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు గురువారం తెలిపారు. ఉద్యోగాలకు 8 తరగతి, అంతకంటే ఎక్కువ చదివిన వారు, ఇంగ్లీష్‌పై అవగాహనను విద్యార్హతలుగా వెల్లడించారు. వయస్సు 21 నుంచి 45 సంవత్సరాల మధ్యలో ఉండి, మూడు సంవత్సరాలు అనుభవం కలిగిన వారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు సంబంధిత వెబ్‌సైట్ల ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 99888 53335, 85559 01198 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జనన ధ్రువీకరణకు ఆధార్ ప్రామాణికం కాదు

ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) ప్రాంతీయ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధార్ కార్డులో పుట్టినతేదీని పౌరుల జనన ధ్రువీకరణకు ప్రామాణికంగా పరిగణించబోమని ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) ప్రాంతీయ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) తాము జారీ చేసిన ఆధార్ కార్డులోని పుట్టిన తేదీ సంబంధిత పౌరుల జనన ధ్రువీకరణకు ప్రామాణికం కాదని స్పష్టం చేసిన దృష్ట్యా, ఈపీఎఫ్ఓ పుట్టిన తేదీ సవరణకు చెల్లుబాటయ్యే పత్రాల జాబితా నుంచి ఆధార్‌ను తొలగించినట్లు వివరించారు. యూఐడీఏఐ ఉత్తర్వులకు అనుగుణంగా ఈపీఎఫ్ఓ జారీ చేసిన డిక్లరేషన్ ఆధారంగా భవిష్యనిధి సభ్యుల పుట్టిన తేదీ దిద్దుబాటు కోసం ఆమోదయోగ్యమైన పత్రాల జాబితా నుంచి ఆధార్‌ను తొలగించినట్లు తెలిపారు. ఉద్యోగుల పుట్టిన తేదీని మార్చేందుకు ఆధార్, ఈ–ఆధార్ పత్రాలు చెల్లుబాటు కావని, ఈపీఎఫ్ సభ్యులు, యజమానులు, లబ్ధిదారులు గమనించాలని సూచించారు. ఇకపై పుట్టిన తేదీ రుజువు కోసం ఆధార్‌ను సమర్పించేందుకు అవకాశం లేదని, ఇతర మార్పులకు సంబంధించిన పత్రంగానే ఆధార్ పరిగణించబడుతుందని పేర్కొన్నారు.